

సైన్‌ఫేర్ అదుర్స్ 2



గంజాయి తరలిస్తున్న ఐదుగురి అరెస్ట్ 2


AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## అవినీతికి ఆస్కారం లేకుండా ప్రయత్నం చేశా



**అక్షరటుడే, కామారెడ్డి:** గడిచిన రెండేళ్లలో కామారెడ్డి మున్సిపాలిటీలో అవినీతికి ఆస్కారం లేకుండా తనవంతు ప్రయత్నం చేశానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో గురువారం మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా పోటీకి సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. కామారెడ్డి మున్సిపాలిటీలో అవినీతి పోవాలంటే బీజేపీ అభ్యర్థులు గెలవాలన్నారు.


8-1-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2




## పక్కాగా తుది ఓటరు జాబితా

**అక్షర టుడే, ఇందూరు:** ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా తుది ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాటి అధికారులకు సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయాన్ని గురువారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఒక్కో వార్డువారీగా ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలన్నారు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ముసాయిదా జాబితాను ప్రదర్శించాలని తెలిపారు ఈ నెల 12వ తేదీన తుది ఓటర్ జాబితా వెలువరించాలని సూచించారు. బోగస్ ఓటర్లకు తావు లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ అనవసర తప్పిదాలకు తావులేకుండా సంబంధిత బూత్ లెవెల్ అధికారులు, సూపర్‌వైజర్లను బాధ్యులుగా పరిగణిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, కమిషనర్ శ్రావణి, తహశీల్దార్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం అవుతోంది. త్వరలో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. దీంతో సీటు కోసం ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తమ వార్డుల్లో సీటు ఖరారు చేసుకునేందుకు అన్ని పార్టీల నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా పార్టీల బడా నేతలను కలిసేందుకు హైదరాబాద్‌కు పయనమవుతున్నారు. ఇప్పటికే పలువురు నేతలు రాష్ట్ర రాజధానిలో తిష్ట వేశారు.

- అక్షరటుడే, ఇందూరు



# టికెట్ల కోసం పాట్లు

■ మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి ఆశావహుల ప్రయత్నాలు ■ బడా నేతలను ప్రసన్నం చేసుకుంటున్న వైనం ■ సీటు ఖరారు కోసం హైదరాబాద్‌కు పయనం


మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఫిబ్రవరిలో నిర్వహిస్తారన్న సమాచారంతో ప్రధాన పార్టీల ఆశావహుల్లో కోలాహలం నెలకొంది. మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లతోపాటు నూతనంగా పోటీ చేసేవారు తమ సీటును ఖరారు చేసుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇప్పటినుంచి తమ వార్డు పరిధిలోని పెద్దలను కలవడం, గతంలో చేసిన అభివృద్ధిని ప్రస్తావించడం, సమస్యలను గుర్తించే పనిలో పడ్డారు. ప్రధానంగా తమకు పట్టున్న వార్డులో సీటు ఖరారు చేసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఒకవైపు రిజర్వేషన్లు మారుతాయన్న ఊహాగానాలు.. మరోవైపు తమకు సీటు ఖరారు అవుతుందో లేదోనన్న ఉత్కంఠతో తర్జనభజన పడుతున్నారు.

### పార్టీల సర్వే

ఒకవైపు ఆశావహుల ప్రయత్నాలు కొనసాగుతున్నా.. మరోవైపు పార్టీల హైకమాండ్ మాత్రం గుట్టు చప్పుడు కాకుండా సర్వేలు నిర్వహిస్తోంది. సంబంధిత వార్డులో గెలుపు గుర్రాల కోసం అన్ని పార్టీలు సర్వేలు చేస్తున్నాయి. అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు, ప్రజల మద్దతు, గత అభివృద్ధి తదితర అంశాలతో సర్వే నిర్వహించి సరైన అభ్యర్థిని పోటీలో నిలబెట్టే లా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఎంపీ అర్వింద్, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి సర్వే నిర్వహిస్తున్నట్లు గతంలో ప్రకటించారు. మెజారిటీ స్థానాలను గెలుచుకోవాలని అన్ని పార్టీలు ప్రణాళికలు రచిస్తున్నాయి. దీంతో బలమైన అభ్యర్థులను బరిలో దింపేందుకు సిద్ధం అవుతున్నాయి.

### నేతలను కలిసేందుకు..

బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ పార్టీల నాయకులు గత నాలుగు రోజులుగా రాష్ట్ర రాజధానికి పయనమవుతున్నారు. కొందరు నేతలు గత మూడు రోజులుగా అక్కడే తిష్ట వేసి పార్టీ పెద్దలను కలిసేందుకు ఎదురుచూస్తున్నారు. బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న వారు ఎంపీ అర్వింద్‌ను, కాంగ్రెస్ ఆశావహులు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కలిసేందుకు వెళ్తున్నారు. ఎంఐఎం సీటును ఆశిస్తున్న వారు హైదరాబాద్‌లోని దారుసలాంకు, బీఆర్ఎస్ నేతలు జీవన్ రెడ్డితో పాటు ఇతర పెద్దలను కలుస్తున్నారు.



## ఫారెస్ట్, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయ లోపం : కోదండ రెడ్డి

**అక్షరటుడే, గాంధారి:** ఫారెస్ట్, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయ లోపంతో కొంతమంది రైతులు ఇబ్బంది పడ్డ మాట వాస్తవమేనని రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పోడుభూముల సమస్యలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు సమన్వయంగా సర్వే నిర్వహించిన పోడు భూముల రైతులకు న్యాయం చేయాలని కోదండ రెడ్డి సూచించారు. త్వరలోనే అర్హులైన వారికి పోడు భూమి పట్టాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఇటీవల సీఎంతో మాట్లాడినప్పుడు సైతం పోడురైతుల సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ మెంబర్లు గడుగు గంగాధర్, రాము నాయక్, రామ్ రెడ్డి, నరసింహారెడ్డి, మరికంటి భవాని, సునీల్ కుమార్, వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

## తరగతులు బహిష్కరించి విద్యార్థుల నిరసన



**అక్షరటుడే, బోధన్:** అసభ్య పదజాలంతో లెక్చరర్ దూషిస్తుండడంతో విద్యార్థినులు తట్టుకోలేకపోయారు. తరచూ తిట్ల పురాణం వినలేక విసుగెత్తి తరగతుల నుంచి బయటకు వచ్చి ఆందోళనకు దిగారు. ఈ ఘటన ఎడపల్లి మండలంలోని తెలంగాణ రెసిడెన్షియల్ బాలిక జూనియర్ పాఠశాల, కళాశాలలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కళాశాలలోని ఓ మహిళా లెక్చరర్ తరచూ తమను అసభ్య పదజాలంతో దూషిస్తోందని పేర్కొంటూ విద్యార్థులు తరగతులు బహిష్కరించారు. కళాశాల ఆవరణలో భైఠాయించారు. కళాశాలలో లెక్చరర్ వేధింపులు తాము తట్టుకోలేకపోతున్నామని వాపోయారు.

## వాహనదారులు హెల్మెట్ ధరిస్తేనే భద్రత: ఏసీపీ



**అక్షరటుడే, బోధన్:** వాహనదారులు హెల్మెట్ ధరిస్తేనే భద్రత అని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం బోధన్ పట్టణంలో హెల్మెట్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఏసీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్‌ను బరువు కాకుండా బాధ్యతగా భావించాలని తెలియజేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ మన ప్రాణాలను కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో బోధన్ ఆర్టీవో శ్రీనివాస్, సీఐ వెంకటనారాయణ, రూరల్ ఎస్సై మశ్చేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న రోడ్డు ప్రమాదాలు: కలెక్టర్

**అక్షరటుడే, కామారెడ్డి :** రోడ్డు ప్రమాదాలు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం కామారెడ్డిలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలసూచించారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించుకుని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని సూచించాలన్నారు.



ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. ప్రతి ఒక్క ద్విచక వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్, ట్రాఫిక్ నియమాలను పాటిస్తేనే ప్రాణ రక్షణ సాధ్యమన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను సైతం రిస్క్‌లో పెట్టినవాళ్లమవుతామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం వాహనదారులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** న్యాయవాదుల పెండింగ్ సమస్యలను త్వరలోనే పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నం అశోక్ గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన నిజామాబాద్ నగరంలోని జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న హెల్త్ ఇన్సూరెన్స్ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మామిళ్ల సాయిరెడ్డి, మాణిక్ రాజ్, సీనియర్ అడ్వకేట్లు దయాకర్ గౌడ్, రెంజర్ల సురేష్, ముత్యాల శ్యాం బాబు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ నియమాలపై అవగాహన

**అక్షరటుడే, బాన్సువాడ:** యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, ఇంపాక్ట్ ఫౌండేషన్ ప్రతినిధి రఘు సూచించారు. వర్ని మండలం కోటయ్య క్యాంప్‌లోని కస్తూర్బా గాంధీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ట్రాఫిక్ నియమాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటి నుంచి దూరంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్సై వంశీకృష్ణ, పాఠశాల హెచ్ఎం సరస్వతి, రేణుకా తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పథకంపై కాంగ్రెస్ దుష్ప్రచారం

**అక్షరటుడే, ఇందూరు :** ఉపాధి హామీ చట్టం మార్పుపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పేరు మార్పుపై కాంగ్రెస్ మాటల్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పథకాన్ని 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచామని వివరించారు. గత పాలకులు కేవలం తమకు అనుకూలంగా ఉన్న పనులను మాత్రమే చేసిందన్నారు. ప్రస్తుతం అలాకాకుండా గ్రామ సభ నిర్ణయం మేరకు పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇటువంటి చట్టంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రధానంగా గ్రామ అభివృద్ధి యువతకు ఉపాధి కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని దినేస్ అన్నారు. గత పాలకులు కాంగ్రెస్ నాయకులు సీఎం సభలకు ఉపాధి హామీ చట్ట నిధులు వినియోగించడం దారుణమని విమర్శించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నాగోల్ల లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్లు నాయకులు పాల్గొన్నారు.





## నేను కర్మ ఫలితాన్ని, ధర్మాన్ని నమ్ముతా...: ముత్యాల సునీల్

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** కొంతమంది జీఎస్టీ అధికారుల అత్యుత్సాహం కారణంగానే తన ఆరెంజ్ ట్రావెల్స్ సంస్థపై అనవసర విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయని ట్రావెల్స్ అధినేత, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మోర్తాడ్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టకాలంలో తనకు అండగా నిలిచిన బాల్కొండ నియోజకవర్గ ప్రజానీకానికి, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. కొంతమంది జీఎస్టీ అధికారులు అత్యుత్సాహం వల్లే తన సంస్థపై విచారణ జరిగిందని సునీల్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 12శాతం, మిగతా రాష్ట్రాలలో ఐదు శాతం జీఎస్టీని బస్సుల మీద యథావిధిగా కట్టేవాళ్లమని ఆయన తెలిపారు. కానీ మొత్తం మీద 12శాతం జీఎస్టీ కట్టాలని అధికారులు తమపై ఒత్తిడి చేశారన్నారు. దానివల్ల రూ.28 కోట్లు అదనంగా జీఎస్టీ కట్టాలని తనపై తన సంస్థపై విచారణ చేపట్టారన్నారు. విచారణ సందర్భంగా తనను అరెస్టు చేయాలని చూశారన్నారు. కోర్టుకు వెళ్లడంతో అనవసరంగా ఓ వ్యక్తిని ఇబ్బంది పెడుతున్నారని పేర్కొంటూ కోర్టు సైతం జీఎస్టీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిందని తెలిపారు.



ఆరెంజ్ ట్రావెల్స్ సంస్థ నిష్పక్షపాతంగా నిజాయితీగా ప్రభుత్వానికి కట్టాల్సిన పనులన్నీ కడుతుందని సునీల్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీని నన్ను వ్యక్తిగతంగా బద్నాం చేయాలని చూశారని కానీ అది సాధ్యపడలేదన్నారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పన్నాగంలో భాగంగానే తనపై ఇదంతా జరిగిందని సునీల్‌రెడ్డి ఆరోపించారు. కోర్టు తీర్పే వారందరికీ చెంపపెట్టు అయిందని సునీల్ రెడ్డి తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.









# సైన్స్ ఫేర్ అదుర్స్

▸ మేధస్సుకు పదును పెట్టిన విద్యార్థులు ▸ అలరించిన ప్రదర్శనలు.. కిక్కిరిసిన ప్రాంగణం

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ రెండో రోజు కొనసాగింది. పలు జిల్లాల నుంచి విచ్చేసిన 1,760 మంది విద్యార్థులు తయారుచేసిన ప్రత్యేక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సైన్స్‌ఫేర్ కార్యక్రమాన్ని తిలకించేందుకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు వేలాదిగా తరలివచ్చారు. దాంతో పాఠశాల ప్రాంగణం విద్యార్థులతో కిక్కిరిసిపోయింది. మరోవైపు విద్యార్థులు తాము తయారుచేసిన ప్రాజెక్టులను తిలకించడానికి వచ్చిన వారికి క్లుప్తంగా వివరించారు. ప్రాజెక్ట్ ఉద్దేశ్యం, తయారు చేసిన విధానం, ప్రాజెక్ట్ ఇచ్చే సందేశాన్ని కూలంకషంగా వివరించారు. కాగా.. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. —అక్షరటుడే, కామారెడ్డి








## పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు



**అక్షరటుడే,బాల్కొండ:** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలోని మదర్ థెరిస్సా, శ్రీ వెంకటేశ్వర హైస్కూళ్లలో గురువారం పతంగుల పండుగ, భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె. రామలక్ష్మి విద్యార్థులతో కలిసి భోగి మంటలు వెలిగించారు. అంతకుముందు విద్యార్థులతో కలిసి పతంగులను ఎగురవేసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. భోగి మంటల చుట్టూ విద్యార్థులు నృత్యాలు చేస్తూ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా హైస్కూల్ హెడ్‌మాస్టర్ కె.నర్సింహారెడ్డి, శ్రీ వెంకటేశ్వర హైస్కూల్ హెడ్ మాస్టర్ కె.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇందూర్ ప్రైమరీ స్కూల్‌లో ఘనంగా సంక్రాంతి వేడుకలు





**అక్షరటుడే, బోధన్:** పట్టణంలోని ఇందూర్ ప్రైమరీ స్కూల్‌లో ఘనంగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా డీటీవో ఉమామహేశ్వరరావు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎక్కడ ఉన్నా మన సంస్కృతి సంప్రదాయాలను మరిచిపోవద్దని విద్యార్థులకు సూచించారు. సంక్రాంతి పండుగను చిన్నారుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. స్కూల్ యాజమాన్యం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పల్లెటూరు సెట్టింగ్‌ను చూసి సంబురపడ్డారు. కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ ఆర్టీవో శ్రీనివాస్, సీఐ వెంకట్, నారాయణ పాఠశాల కరస్పాండెంట్ కోడాలి కిషోర్, బోధన్ ట్రస్మా అధ్యక్షుడు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆశ వర్కర్ల ఛలో కలెక్టరేట్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఆశ వర్కర్ల పోరాటంలో విజయం సాధించామని సీఐటీ యూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని సీఐటీయూ కార్యాల యం వద్ద ఆమె మాట్లాడారు. సమస్యల పరి ష్కారం కోసం ఆశ వర్కర్లు చలో కలెక్టరేట్ కార్యాయం నిర్వహించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లను పోలీసులు సీఐటీయూ కార్యాలయానికి తరలించారు. అక్కడ సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. ఈ మేరకు ఆశవర్కర్ల సమస్య పరిష్కారానికి డీఎంహెచ్‌వో రాజశ్రీ హామీ ఇచ్చారని నూర్జహాన్ తెలియజేశారు. స్వయంగా సీఐటీయూ కార్యాలయానికి వచ్చిన ఆమె స్థానికంగా తమ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని సర్క్యూలర్ జారీ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా నాయకులు సుకన్య, ఇందిరా, రేణుక, నర్స, బాలమణి, దివ్య, విజయ, లావణ్య, శాంతి, రేణుక రేఖ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు హెల్మెట్ ధరించాలి



**అక్షరటుడే, కోటగిరి :** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని ఎస్సై సునీల్ తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా.. పోతంగల్ మండల కేంద్రంలోని రోడ్డు భద్రతపై అవగాహన హెల్మెట్‌తో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ బస్టాండ్ నుంచి చెక్‌పోస్ట్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మన కోసం మన ఇంటి వాళ్లు ఎదురు చూస్తుంటారనేది అనుక్షణం మదిలో గుర్తు పెట్టుకుని వాహనం నడపాలని సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల అనుకోని ప్రమాదాలు ఎదురైనప్పుడు ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ అనేది ప్రాణాలను కాపాడే భద్రత కవచం అని వివరించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనానికి సంబంధించిన పత్రాలు వెంట తీసుకెళ్లాలని ఎస్సై కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, గులాం నబీ, బీజేపీ మండల అధ్యక్షుడు బజరంగ్ (హన్మాండ్లు), ఏఎస్సై బన్సీలాల్, యాదగిరి, అరుణ్ కుమార్, అజ్మత్, ఓమన్నా పటేల్, వాహనదారులు పాల్గొన్నారు.

## సీపీఐ ఖమ్మం సభను జయప్రదం చేయండి




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఖమ్మంలో జరుగనున్న సీపీఐ వందేళ్ల ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ పిలుపునిచ్చారు. ఆ పార్టీ నగర కార్యదర్శి వై.ఓమయ్య ఆధ్వర్యంలో నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. కార్మికులు, ఉద్యోగులు సమస్యలపై వందేళ్లుగా సీపీఐ నిరంతర పోరాటం చేస్తోందన్నారు. ఈ బహిరంగ సభలో ప్రతిఒక్క కార్మికుడు విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ నగర నాయకులు అలీ ఇమ్రాన్, అనిల్, స్రవంతి, సాయమ్మ, రాధా కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ఇద్దరి అరెస్ట్




**అక్షరటుడే, బాల్కొండ:** దర్జాగా గంజాయిని తాగుతున్న వ్యక్తిని, విక్రేతను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు బాల్కొండ పోలీసులు వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు చిట్టాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గంజాయి సిగరెట్ తాగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు నిర్వహించిన పరీక్షలో పాజిటివ్ రావడంతో అతడిని విచారించారు. గంజాయి కొనుగోలుపై ఆరా తీయగా నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం మోహల్లా గ్రామానికి చెందిన లాలప్ప వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపాడు. దీంతో పోలీసులు లాలప్ప ఇంట్లో తనిఖీలు నిర్వహించగా 584 గ్రాముల ఎండు గంజాయి దొరికింది. అలాగే అతడి పెరట్లో ఒక గంజాయి మొక్క కూడా లభ్యమైంది. వాటిని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శైలేందర్ తెలిపారు. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.

## గంజాయి సరఫరా చేస్తున్న ఐదుగురి అరెస్ట్

**అక్షరటుడే నిజామాబాద్ క్రైం :** గంజాయిని సరఫరా చేస్తున్న ఐదుగురిని పోలీసులు నగరంలో అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు గురువారం ఉదయం నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ సమీపంలోని రిలయన్స్ మార్ట్ వద్ద ఎక్సైజ్ సీఐ స్వప్న ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో 10కేజీల ఎండు గంజాయిని సరఫరా చేస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా నేరేడుగొండ మండలం దేవల తండాకు చెందిన పూజా పవార్, ఆదిలాబాద్ జిల్లా కుప్పి గ్రామానికి చెందిన బాయ్ జాదవ్, నాందేడ్ జిల్లా కిన్వట్‌కు చెందిన కిషన్ మోతిరామ్ గాలే, మహారాష్ట్రలోని ఉమర్ కేడ్ చెందిన ఇంద్రజిత్ టార్గె, కామారెడ్డి జిల్లా గాంధారి మండలం చద్మల్ గ్రామానికి చెందిన మంజ వెంకట్రామ్‌లను అరెస్టు చేశారు. ఇద్దరు మహిళలు కలిసి మధ్యప్రదేశ్‌లోని సిర్పూర్‌లో ఓ వ్యక్తి నుండి గంజాయిని కొనుగోలు చేశారు. అనంతరం బస్‌లో నిర్మల్ వచ్చి నిర్మల్ నుండి నిజామాబాద్‌కు బస్‌లో వచ్చి.. రిలయన్స్ మార్ట్ వద్ద ముగ్గురు వ్యక్తులకు గంజాయి అప్పగిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. సమావేశంలో ఎక్సైజ్ పోలీసులు సుమిత, సునీల్, ప్రభాకర్, రవి, సంగయ్య, సౌమ్య, సంజయ్ పాల్గొన్నారు.





## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**అక్షరటుడే, ఆర్మూర్:** నందిపేట్ మండలంలోని గొట్టుముక్కలలో గురువారం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారులు కందూరి గంగాధర్ రూ.60,000, నేమూరి సుజాతకు రూ.54,000, గల్వె చిన్న గంగాధర్ రూ.22,000, మేకల కమలకు రూ.6,500, యాట రజిని రూ.13,500లకు చెక్కులు అందజేశారు.



## పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

**అక్షరటుడే, మప్కాల్:** బాల్కొండ నియోజకవర్గంలో ముప్కాల్, మెండోరా, బాల్కొండ మూడు మండలాల పాస్టర్ల ఆధ్వర్యంలో ఉమ్మడి నూతన కమిటీ ఏర్పాటైంది. కమిటీకి అధ్యక్షుడిగా కృపానందం, ఉపాధ్యక్షుడిగా స్టీవెన్, జనరల్ సెక్రెటరీగా స్పర్జన్ రాజ్, జాయింట్ సెక్రెటరీగా క్రీస్తుదాస్, ట్రెజరర్‌గా ప్రశాంత్, సలహాదారుగా రాజారత్నం ఎన్నికయ్యారు.

## నల్లూర్‌లో పశువులకు టీకాలు



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని నల్లూర్ గ్రామంలో మేకలు, గొర్రెలకు పోచమ్మ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 985 జీవాలకు టీకాలు వేసినట్లు అధికారులు తెలిపారు. టీకాల పంపిణీని నల్లూర్ సర్పంచ్ గంగాధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జీవాల పెంపకదారులు పిండి మహేష్, పిండి రాజేశ్వర్, పిండి భూమన్న పాల్గొన్నారు. పశువైద్యాధికారిణి ఆర్.ఉజ్వల, గోపాలమిత్ర ప్రణీత్, పశుమిత్ర సిబ్బంది షకీల్, బషీర్, ఆఫీస్ సబార్డినేట్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## పెద్దకొడప్‌గల్‌లో రక్తదాన శిబిరం

**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్:** మండల కేంద్రంలోని పాత గ్రామ పంచాయతీ ఆవరణంలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జగద్గురువు స్వామి నరేంద్రాచార్య జీ మహరాజ్ మండలి ప్రముఖ్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేయగా పలువురు యువకులు ఉత్సాహంగా రక్తదానం చేశారు. అత్యవసర సమయంలో రక్తదానం చేయడం వల్ల ప్రాణాలను నిలబెట్టినవారం అవుతామని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వామి నరేంద్రాచార్యజీ శిష్యులు, ఉప సర్పంచ్, నాయకులు, యువకులు పాల్గొన్నారు.